
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
జనగామ
మంగళవారం 6 ఆగస్టు 2024




జనగామ కలెక్టరేట్‌లో ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన వీఆర్‌ఏల వారసులు (ఫైల్)



జీవో ఇచ్చారు.. ఉద్యోగం మరిచారు..

- 61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల వారసులకు ఏడాదిగా దక్కని కొలువు
- కోర్టు కేసుతో గత ప్రభుత్వంలో నియామకాలు పెండింగ్
- రాష్ట్రవ్యాప్తంగా 3,797 మంది ఎదురుచూపులు

జనగామ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): 61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల వారసులకు ఎదురుచూపులే దిక్కవుతున్నాయి. ఏడాదిగా ఉద్యోగం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం 61 ఏళ్ల లోపు ఉన్న వీఆర్‌ఏలకు ఉద్యోగాలు ఇవ్వగా 61 ఏళ్ల పైబడిన వారి వారసులకు ఇప్పటికీ ఇవ్వలేదు. కోర్టు కేసు కారణంగా కొంత జాప్యం జరగగా అంతటితోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, ప్రభుత్వాలు మారడంతో వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాల అంశం మరుగున పడిపోయింది. రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్‌ఏలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతేడాది జూలైలో జీవో 81ను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా 61 ఏళ్ల లోపు వీఆర్‌ఏలు, 61 ఏళ్లు పైబడిన వీఆర్‌ఏలను కేటగిరీలుగా ప్రభుత్వం విభజించింది. వీరిలో 61 ఏళ్ల లోపు వారికి ఉద్యోగాలు ఇవ్వగా 61 ఏళ్లు పైబడిన వారి వారసులకు ఉద్యోగాలు ఇస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు సంబంధించి జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చింది. కలెక్టర్ల నుంచి జిల్లాల వారీగా సమాచారం తెప్పించుకున్న అప్పటి ప్రభుత్వం ఏ జిల్లాలో ఎంత మంది వీఆర్‌ఏలు ఉన్నారు, ఇందులో 61 ఏళ్ల లోపు ఉన్నవారు ఎంత మంది, 61 ఏళ్ల పైబడిన వారు ఎంత మంది ఉన్నారనే వివరాలను తీసుకుంది. 61 ఏళ్ల లోపు ఉన్న వీఆర్‌ఏలకు వారి వారి విద్యార్హతలను బట్టి ఇతర శాఖల్లో ఉద్యోగాలు ఇచ్చింది. 10వ తరగతి వారికి ఆఫీస్ సబార్డినేట్, ఇంటర్ వారికి రికార్డ్ అసిస్టెంట్, డిగ్రీ వారికి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పించింది. అదే విధంగా 61 ఏళ్ల పైబడిన వీఆర్‌ఏల వారసులకూ వారి విద్యార్హత ఆధారంగానే ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ శాఖలో 20,555 మంది వీఆర్‌ఏలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇందులో 61 ఏళ్ల లోపు ఉన్న 16,758 మంది వీఆర్‌ఏలకు గత ఏడాది ఆగస్టు నెలలోనే నియామక పత్రాలను అందించింది. కాగా.. 61 ఏళ్ల పైబడిన 3797 మంది వీఆర్‌ఏల వారసులకు మాత్రం ఏడాదైనా ఉద్యోగాలు రాలేదు.



ఏడాదిగా ఎదురుచూపులే..!

తోటి వీఆర్‌ఏలకు ఉద్యోగాలు వచ్చి తమ వారసులకు ఉద్యోగాలు రాకపోవడంతో వీఆర్‌ఏలు ఆందోళన చెందుతున్నారు. ఒకే జీవో కింద నియామకం కావాల్సి ఉండగా కోర్టు కేసు, ఎన్నికల కారణంగా వాయి దా పడడంతో ఏడాదిగా ఉద్యోగాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్లు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నియామకాల వల్ల తమకు అన్యాయం జరుగుతుందని దావా వేశారు. అనంతరం ఉద్యోగాల సంఘాల చొరవతో ఆఫీస్ సబార్డినేట్లు ఈ కేసును అక్టోబరులో ఉపసంహరించుకున్నారు. కాగా.. సరిగ్గా అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్, అమల్లోకి రావడం, ప్రభుత్వం మారడం జరిగిపోయాయి.

తోటి వీఆర్‌ఏలు ఉద్యోగాలు చేసుకుంటుండగా తాము మాత్రం ఖాళీగా ఉండాల్సి వస్తోందని వీఆర్‌ఏల వారసులు ఆవేదన వ్యక్తం చేశారు. నియామక పత్రాలు ఇవ్వకపోవడంతో ఏడాది పాటు సర్వీస్ లాస్ కావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు నియామక పత్రాలు అందించాలని వీఆర్‌ఏలు కోరుతున్నారు.

ప్రక్రియ పూర్తి..

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలకు సంబంధించిన ప్రక్రియ అంతా గత ప్రభుత్వంలోనే పూర్తయింది. వీరి నియామకానికి ఆర్థిక శాఖ క్లియరెన్స్ కూడా రాగా ప్రభుత్వం వద్ద ఫైల్ సిద్ధంగా ఉంది. వారసుల ఎంపిక, సర్టిఫికెట్ల పరిశీలన అంతా గత ఏడాది ఆగస్టులోనే అధికారులు పూర్తి చేశారు. 61 ఏళ్లు నిండిన వారి విషయంలో ఎవరికి ఉద్యోగం ఇవ్వాలనే విషయంపై కుటుంబ సభ్యులే తేల్చుకున్నారు. వీఆర్‌ఏకు ఒకరి కంటే ఎక్కువ వారసులు ఉన్నట్లయితే ఎవరికి ఉద్యోగం ఇవ్వాలనే విషయంపై వీఆర్‌ఏ కుటుంబం ఏకాభిప్రాయానికి వచ్చి అధికారులకు నో అబ్జక్షన్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్లను అందజేశారు. వారసుల్లో ఒకరు ఉద్యోగం కావాలనుకుంటే, మరొకరికి భూమి లేదా ఇల్లు, ఇతర ఆస్తులు తీసుకొని పరస్పర అంగీకారంతో నో అబ్జక్షన్ సర్టిఫికెట్‌ను అందజేశారు. కాగా.. భూములు, ఇతర ఆస్తులు తీసుకున్న వారు సంతోషంగా ఉండగా, ఉద్యోగం కావాలని కోరుకున్న తమకు ఏడాదిగా నిరాశే మిగిలిపోతుందని పలువురు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం త్వరలో కొత్త రెవెన్యూ బిల్లును తీసుకొస్తున్న నేపథ్యంలో ఆ బిల్లులో తమను నియమిస్తూ నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం పెద్ద మనసుతో ఆలోచించాలి

- ముస్త్యాల రాజు, వీఆర్‌ఏ వారసుడు, జనగామ జిల్లా



61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం పెద్ద మనసుతో ఆలోచన చేయాలి. మా నియామకానికి సంబంధించిన ప్రక్రియ అంతా గతంలోనే పూర్తి అయింది. ప్రస్తుతానికి ఈ అంశంపై ఎలాంటి అభ్యంతరాలు లేవు. ప్రభుత్వం తలచుకుంటే ఒక్క సంతకంతో రాష్ట్రవ్యాప్తంగా 3,797 మంది వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు వస్తాయి. మాకు రెవెన్యూ శాఖలోనే ఉద్యోగం ఇవ్వాలని మేము కోరడం లేదు. మాకు కావాల్సింది ఉద్యోగం.. ఏ శాఖలో ఇచ్చినా సంతోషం వెళ్లి చేస్తాం.

గ్రామాల శుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



జనగామ మండలం శామీర్‌పేటలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా కలెక్టర్ జిల్లాకేంద్రంలోని 13వ వార్డుతో పాటు జనగామ మండలం యశ్వంతాపూర్, శామీర్‌పేట గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆయా గ్రామాలు, పట్టణంలోని వార్డుల్లో పాఠశాల విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి పారిశుధ్యం, మొక్కల పెంపకంపై నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి భవిష్యత్తులో ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుకునేలా ప్రజలంతా ముందుకు రావాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో పల్లెలు, పట్టణాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలను ప్రణాళికబద్ధంగా ముందుకు తీసుకుపోవాలని సూచించారు. 'నా గ్రామం- నా గౌరవం' అనే భావనతో పారిశుధ్య, మొక్కల పెంపకంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల్లో వీధి కుక్కలను గుర్తించి యాంటీ రేబిస్ టీకాలు వేస్తున్నామని, వీధి కుక్కల నియంత్రణకు వాటికి ఆపరేషన్లు చేస్తున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున గ్రామాల్లో జ్వర సర్వేను చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజలు జ్వరాల బారిన పడితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. వానాకాలం దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. పిల్లలకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, డీపీవో స్వరూప, ఇన్‌చార్జి జడ్పీ సీఈవో సరిత, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్ర, 13వ వార్డు కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళ, అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల గురుకులాలను

తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

పాడైపోయిన ఉల్లిగడ్డల గుర్తింపు

కాంట్రాక్టర్‌కు నోటీసులివ్వాలని ఆదేశం



కస్తూర్బా గాంధీ పాఠశాలలో వంటలను రుచి చూస్తున్న అదనపు కలెక్టర్

పాలకుర్తి, ఆగస్టు 5: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలను సోమవారం జనగామ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ సందర్శించారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో కంపు కొడుతున్న డ్రైనేజీ పక్కన వంటలు వండటాన్ని గమనించి అక్కడ వంట చేయవద్దని వంట హాలులోనే చేయాలని సూచించారు. కుళ్లిన ఉల్లిగడ్డలు పరిశీలించి కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వాలని ఆ పాఠశాల ప్రత్యేకాధికారి నవీనను ఆదేశించారు. వారం రోజులకు మళ్లీ పాఠశాలకు వస్తానని తెలిపారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో వంటలను రుచి చూసి రుచిగా ఉన్నాయని అన్నారు. ఇంకా నాణ్యతతో కూడిన వంటకాలు చేయాలని, మెనూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పిచ్చి మొక్కలను తొలగించాలని, కూలిన ప్రహరీ గోడను నిర్మించే విధంగా తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములును ఆదేశించారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తేనే బాగా చదువుతారని అన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న అన్ని రకాల ఆహార పదార్థాలను నాణ్యతతో ఇవ్వాలని ఆదేశించారు. ఒక వేల కుళ్లిన కూరగాయలు, పండ్లు అందచేస్తే కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తెలంగాణ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్వరూప, పాలకుర్తి ప్రత్యేక అధికారి జయంతి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వాచారి, ఆర్ఐ రాకేష్ ఉన్నారు.

కేసు విషయంలో వెళ్తే సీఐ దాడి చేశారు

న్యాయవాద దంపతుల ఆరోపణ

ఎలాంటి దాడి చేయలేదని సీఐ స్పష్టీకరణ

వివరాలు 8వ పేజీలో

నియోజకవర్గంలో

అవినీతి అంతమే నా లక్ష్యం



కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

- అధికారులకు ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదు
- దరఖాస్తులను ముందుకు తీసుకెళ్లడానికి ఎవరైనా డబ్బులు అడిగితే చెప్పండి
- ఆగస్టులోనే వందపడలక ఆస్పత్రికి శంకుస్థాపన ఉంటుంది
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

7లో..

సోమన్న ఆలయంలో శ్రావణమాసం పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పాలకుర్తి, ఆగస్టు 5: శ్రీ సోమేశ్వర లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం పురస్కరించుకొని మొదటి సోమవారం కాగా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజలు చేశారు. ఉదయం నుంచే వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారికి అభిషేకం, అర్చనలు చేశారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా క్యూలైన్ పాటించే విధంగా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, ఆలయ సూపరిండెంట్ వెంకటయ్య, సిబ్బంది రాములు, శ్రీనివాస్, అశోక్, అర్చకులు డీ.వీ.ఆర్ శర్మ, అనిల్, నాగరాజు ఉన్నారు.

అదనపు లేబర్ లేకుండా పనులెలా?

తాత్కాలిక కార్మికులను కేటాయించాలి

మునిసిపల్ అత్యవసర సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్

జనగామ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అదనపు కార్మికులు లేకుండా ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమ నిర్వహణ ఎలా సాధ్యమని కౌన్సిలర్లు ప్రశ్నించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నేపథ్యంలో జనగామ మునిసిపల్‌లో సోమవారం అత్యవసర సమావేశం ఛైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమ నిర్వహణపై చర్చ జరిగింది. చర్చలో భాగంగా పలువురు కౌన్సిలర్లు పలు డిమాండ్లను లేవనెత్తారు. బీజేపీ ఫ్లోర్‌లీడర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త మాట్లాడుతూ తాత్కాలికంగా అదనపు లేబర్‌ను కేటాయిస్తేనే వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ సాధ్యమవుతుందన్నారు.

అదనపు లేబర్ లేకుండా పనులు చేయలేమని తేల్చి చెప్పారు. మునిసిపల్ సమావేశానికి అధికారులు ఎవరూ రాకపోతే సమస్య ఎవరికి చెప్పుకోవాలన్నారు. వార్డులో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉందని, రోడ్లు గుంతలమయంగా మారాయని అన్నారు. హరిశ్చంద్రగుప్త మాట్లాతుండగా 30వ వార్డు కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్ అభ్యంతరం తెలిపారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. కౌన్సిలర్లు పేర్ని స్వరూప మాట్లాడుతూ గత ఏడాది అదనపు లేబర్లు కేటాయించి పనులు చేయించారని, ఈసారి ఎందుకు కేటాయించరని నిలదీశారు. లేబర్‌ను కేటాయించకుండా పనులు చేయాలంటే చేయలేమని పలువురు కౌన్సిలర్లు తేల్చి చెప్పారు. కాగా.. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఛైర్‌పర్సన్ అన్నారు. కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయం

అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



చాగల్‌లో మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 5: గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిందని జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని చాగల్ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా రైతు వేదిక వద్ద నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు చేబట్టిన ర్యాలీలో ఆయన పాల్గొని పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగుపరుచాలన్నారు. 9వ తేది వరకు జరిగే ఐదు రోజుల వివిధ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్లను, రోడ్లను శుభ్రం చేయాలన్నారు. గ్రామాల వారీగా మరుగుదొడ్లు లేని గృహాలను గుర్తించాలన్నారు. ఇళ్లలోని చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్‌లకు పంపేచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రం లో జరిగిన ర్యాలీలో పాల్గొని ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటా రు. కార్యక్రమంలో డీఎల్‌పీవో వెంకటిరెడ్డి, ఆర్డీవో వెంకన్న, ఎంపీడీవో మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు చుక్క లింగయ్య, సత్యనారాయణ, ఏపీఎం కుమార్, పశువైద్యాధికారి డాక్టర్ మౌనిక, ఏపీఓ ప్రేమయ్య, మాజీ సర్పంచ్ పోగుల సారంగపాణి, జీపీ సిబ్బంది శ్రీనివాస్, గట్టు మంజుల, రవి తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న వెస్ట్‌జోన్ డీసీపీ బి.రాజ మహేంద్ర నాయక్

ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు జాగ్రత్తలు పాటించాలి

డీసీపీ రాజ మహేంద్ర నాయక్

జనగామ కల్చరల్, ఆగస్టు 5: ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు విద్యార్థుల పట్ల జాగ్రత్తలు పాటించాలని వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ కోరారు. ఇటీవల అడవికేశ్వాపురంలో స్కూలు బస్సు కింద పడి విద్యార్థి మృతి చెందిన సంఘటన నేపథ్యంలో సోమవారం జనగామ పోలీస్ స్టేషన్‌లో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ స్కూలు బస్సులో అటెండరుతో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ప్రీకాషన్లను తెలియజేస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను సైతం విద్యార్థులకు తెలియజేయాలన్నారు. స్కూళ్లలో గంజాయి తరహా ఏవైనా డ్రగ్స్ అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ఏసీపీ పార్థసారధి, సీఐ రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలి

రఘునాథపల్లి: ప్రతీ ఒక్కరికి స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందించే చెట్లను మరింత పెంచాల్సిన అవసరం ఉందని, అందు కోసం ప్రజలందరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని వెస్ట్‌జోన్ డీసీపీ రాజ మహేంద్ర నాయక్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రఘునాథపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో రాజ మహేంద్ర నాయక్ సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ ఆర్.భీంశర్మ, ఎస్ఐ డి.నరేష్, ఏఎస్ఐ సయ్యఉబేదుల్లా, పోలీస్ సిబ్బంది సారంగపాణి, వీరన్న, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరో వస్తారని ఎదురుచూడొద్దు..

- మన ఊరుని మనమే బాగు చేసుకోవాలి
- స్వచ్ఛదనంలో మహిళల పాత్రే కీలకం
- రాష్ట్ర ప్రత్యేకాధికారి అలగు వర్షిణి



నెల్లుట్ల పాఠశాలను సందర్శించిన ప్రత్యేకాధికారి వర్షిణి

లింగాలఘణపురం, ఆగస్టు 5: ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురుచూడటం మానేసి ఎవరి గ్రామాన్ని వారే తీర్చిదిద్దుకునేందుకు ప్రతీ ఒక్కరు నడుంబిగించాలని స్వచ్ఛదనం.. పచ్చదనం స్టేట్ స్పెషల్ ఆఫీసర్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రెటరీ అలగు వర్షిణి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమ అమలుతీరును పరిశీలించేందుకు సోమవారం లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామాన్ని వర్షిణి సందర్శించారు. స్థానిక పాఠశాలను సందర్శించి అడిషనల్ కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి మొక్కలను నాటారు. గ్రామపంచాయతీలో యాక్షన్‌ప్లాన్ రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛదనం కార్యక్రమం విజయవంతం చేయడంలో మహిళల పాత్ర కీలకంగా ఉంటుందని సూచించారు. ప్రతీ మహిళ తన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోగలిగితే ఊరంతా స్వచ్ఛత నెలకొంటుందని సూచించారు. అదేవిధంగా ఊరంతా పచ్చదనం వికసించేలా ప్రతీ ఒక్కరు బాధ్యతగా పాటుపడాలని సూచించారు. అధికారులు ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈసందర్భంగా తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన పాఠశాల విద్యార్థులతో మాట్లాడిన స్పెషల్ ఆఫీసర్ యూనిఫాం డిజైన్ ఎలా ఉందని అడగ్గా బాగుందని చిన్నారులు బదులిచ్చారు. తెలంగాణ విద్యాశాఖ రూపొందించిన యూనిఫాం డిజైన్ రూపకల్పన కమిటీలో తాను సభ్యురాలిగా ఉన్నానని తానే ఈ డిజైన్‌ను ప్రతిపాదించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఈవో రాము, అధికారి వెంట మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్‌రావు, ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, నోడల్ అధికారి విష్ణుమూర్తి, ఎంపీవో రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డితో పాటుగా పలువురు అధికారులు పాల్గొన్నారు.



రెండు రోజులపాటు కోమటిపల్లి రైల్వే గేటు మూసివేత

కాజీపేట, ఆగస్టు 5 కాజీపేట - హసన్‌పర్తి రైల్వే స్టేషన్ మధ్య ఉన్న కోమటిపల్లి రైల్వే గేటును మంగళవారం, బుధవారం రెండు రోజులపాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే ట్రాక్ పనుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ మార్గం మీదుగా ప్రయాణించే వారు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.








నర్సరీలో మొక్కను నాటుతున్న జంగా రాఘవరెడ్డి


ఆయిల్‌పామ్ సాగు పెంపుపై దృష్టి

తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి


జనగామ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును మరింతగా పెంచేందుకు ప్రభుత్వం సారించిందని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. జనగామ మండలం ఎల్లంల శివారులో ఉన్న ఆయిల్‌పామ్ నర్సరీని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జంగా మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతుల కు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఆర్థికంగా బలపడే అవకాశం ఉన్నందున రైతులు ఈ సాగుపై మొగ్గుచూపాలన్నారు. సాగుకు నాణ్యమైన మొక్కలను అందించేందుకు గానూ నర్సరీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు పెంపునకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. వన మహోత్సవంలో భాగంగా నర్సరీలో జంగా మొక్కను నాటారు. ఆయన వెంట జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్ రావు, అధికారులు రవికాంత్, రామకృష్ణ, రవళి, ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నారు.






















ఇంటర్ విద్యార్థి అదృశ్యం

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 5: మండలంలోని శివునిపల్లి గ్రామానికి ఎస్. యశ్వంత్‌రెడ్డి అనే ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. విద్యార్థి తల్లిదండ్రు లు మహేశ్వరి - అమరేందర్‌రెడ్డి తెలిపిన వివరా లు ఇలా ఉన్నాయి. యశ్వంత్‌రెడ్డి 2023-24 విద్యా సంవత్సరంలో డివిజన్ కేంద్రంలోని హోలీక్రాస్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ హనుమకొండలోని ఓ ప్రయివేటు కళాశాలలో బైపీసీ గ్రూపులో చేరి హాస్టల్‌లో ఉండి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం యశ్వంత్‌రెడ్డి తల్లిదండ్రులతో ఫోన్‌లో బాగానే మాట్లాడాడని తెలిపారు. సోమవారం తెల్లవారుజామున హాస్టల్ వార్డెన్ విద్యార్థులను నిద్రలేపే క్రమంలో యశ్వంత్‌రెడ్డి కనిపించలేదు. వార్డెన్ ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వగా.. ప్రిన్సిపాల్ విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. వెంటనే తల్లిదండ్రులు బంధువలకు, తెలిసినవారికి ఫోన్ చేసి అడిగి పలువురి ఇళ్ల వద్దకు వెళ్లి వెతికినప్పటికీ యశ్వంత్‌రెడ్డి జాడ దొరకలేదు. దీంతో సోమవారం సాయంత్రం తల్లిదండ్రులు హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి మిస్సింగ్ పై ఫిర్యాదు చేశారు. తమ కుమారుడి అచూకీ తెలుసుకొని అప్పగించాలని పోలీసులను వేడుకున్నారు. ఎవరికైనా అచూకీ తెలిస్తే 8897224045, 9866509162, 9704618147 నెంబర్లలో సమాచారం అందించాలని వేడుకున్నారు.

గర్భిణీపై దాడి.. గర్భస్థ శిశువు మృతి

పోలీసులను ఆశ్రయించిన మహిళ భర్త

మడికొండ, ఆగస్టు 5: నిండు గర్భిణీ పై కొందరు వ్యక్తులు దాడి చేయడంతో సదరు మహిళ గాయపడి గర్భంలో ఉన్న శిశువు మృతి చెందిందని అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత మహిళ భర్త పోలీసులను ఆశ్రయించాడు. మడికొండ ఇన్‌స్పెక్టర్ డి.ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు.. ధర్మసాగర్ మండలం శాయిపేటకు చెందిన చేపూరి శ్రీధర్ కాజీపేట మండలం రాంపేటకు చెందిన అనూషను కొన్నేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. కొంతకాలం కాపురం చేసిన తర్వాత కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం ఆముదాలపల్లికి చెందిన మెడుదల అమిత అనే మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. కాగా, కొంతకాలంగా శ్రీధర్ తిరిగి తన మొదటి భార్య అయిన అనూషతో కలిసి ఉంటూ తన రెండో భార్య వద్దకు వెళ్లడంలేదు. ఈక్రమంలోనే మొదటి భార్య గర్భం దాల్చింది. ఆమె తన తల్లిగారింటి వద్ద ఉండగా నిండు గర్భిణీగా ఉన్న భార్య అనూషను ఆస్పత్రికి తీసుకెళ్ళడానికి శ్రీధర్ రాంపేటకు చేరుకున్నాడు. ఆదివారం తన రెండో భార్య అమిత- మరికొందరితో కలిసి రాంపేటకు చేరుకొని తన భర్త శ్రీధర్, అతడి మొదటి భార్య అనూషపై దాడి చేశారు. దీంతో గాయపడిన అనూషను ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు ఆపరేషన్ చేసి శిశువును బయటికి తీసి గర్భంలోనే చనిపోయిందని తెలిపారు. దీంతో తన భార్యపై దాడి చేసి గర్భంలో ఉన్న శిశువు మృతికి కారణమైన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని సోమవారం శ్రీధర్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.







(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మెడికల్ ప్రవేశాల్లో ఎన్‌సీసీ కోటా టెన్షన్

2023-24నుంచి ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ సీట్లలో వాటా కట్ ● ఈ మెడికల్ కౌన్సెలింగ్‌కైనా కోటా అమలు చేయాలని విద్యార్థుల విజ్ఞప్తి

మెడికల్ కోర్సుల్లో ఎన్‌సీసీ కోటాపై విద్యార్థుల్లో టెన్షన్ నెలకొంది. త్వరలోనే మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలను చేపట్టేందుకు వరంగల్ కాళోజీ హెల్త్ యూనివర్సిటీ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం రద్దు చేసిన ఎన్‌సీసీ కోటాను కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరిస్తుం దా? లేదా? అనే ఉత్కంఠలో విద్యార్థులున్నారు. రాష్ట్రం లో 5జూలై 2017లో జీవో నెం.114ద్వారా మెడికల్ కోర్సులైన ఎంబీబీఎస్, బీడీఎస్‌ల్లో ఎన్‌సీసీ పూర్తి చేసిన విద్యార్థులకు 1శాతం రిజర్వేషన్‌ను అమలు చేశారు. ఇంటర్మీడియేట్ కంటే ముందు ఎన్‌సీసీలో ఏ, బీ, సీ సర్టిఫికెట్లతో పాటు 75శాతం ఎన్‌సీసీ తరగతులకు హాజరైన వారికి మెరిట్ ఆధారంగా మెడికల్ ప్రవేశాల్లో రిజర్వేషన్ కల్పించారు. కన్వీనర్ కోటాలో ఉన్న సీట్లలో ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ సీటు లభించేంది. ప్రతి ఏటా మెడికల్ సీట్ల ఆధారంగా 50 నుంచి 60మంది వరకు ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ సీట్లు లభించేవి. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం 4జూలై 2023న జీవో నెం.75ను జారీ చేసింది. ఎన్‌సీసీ కేడెట్స్‌కు కల్పిస్తున్న 1శాతం రిజర్వేషన్ తొలిగించి, పీడబ్ల్యూడీ కోటాను పెంచుతున్నట్లు పేర్కొంది. వరంగల్‌లోని కాళోజీ హెల్త్ యూనివర్సిటీకి ఈ మేరకు ప్రభుత్వం లేఖ రాసింది. దీంతో గత ఏడాది మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్‌సీసీ సర్టిఫికెట్ పని చేయకుండా పోయింది. గత నాలుగైదేళ్లుగా మెడికల్ కోర్సుల్లో ఎన్‌సీసీ కోటాలో ప్రవేశం పొందాలని శిక్షణ పొందిన విద్యార్థులకు నిరాశ మిగిలింది. ఈ ఎన్‌సీసీ కోటాలో ప్రవేశాలు పొందే వారిలో అత్యధికంగా పేదలే ఉన్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఎన్‌సీసీ కోటా ద్వారా మెడికల్ కల నేరవేరుతుందనే ఆశలు గల్లంతయ్యాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వందలాది మంది ఎన్‌సీసీ విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రిజర్వేషన్ పునరుద్ధరించేనా?

దేశభక్తిని పెంచే ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. గత ప్రభుత్వం తొలిగించిన 1శాతం రిజర్వేషన్‌ను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా లేక గత పద్ధతినే పాటిస్తుందా అనే ఉత్కంఠలో విద్యార్థులున్నారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 10వేల ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు ఉన్నాయి. వీటిలో కన్వీనర్ కోటాలో 6వేల సీట్లు కేటాయిస్తారని, ఎన్‌సీసీ విద్యార్థులకు 1శాతం రిజర్వేషన్ కల్పించిన సుమారు 60మంది ఎన్‌సీసీ కేడెట్స్‌కు మెడికల్ కోర్సుల్లో చేరేందుకు అవకాశం లభిస్తుందనే ఆశతో ఉన్నారు. ప్రొఫెషనల్ కోర్సులైనా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, పాలిటెక్నిక్, వెటర్నరీ తదితర అన్ని కోర్సుల్లో ఎన్‌సీసీ కోటా అమలు చేస్తున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి మెడికల్ కోర్సులో కూడా ఎన్‌సీసీ కోటాను పునరుద్ధరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఆపరేషన్ 'కరెంట్ పోల్'

విద్యుత్ శాఖలో కొత్త ఒరవడి ● అధికారుల చొరవతో మారుతున్న పనితీరు ● అర్జీలు పెట్టకముందే ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం ● ముమ్మరంగా విద్యుత్ స్తంభాలు, లైన్ల మరమ్మతులు ● పోల్స్‌కు నెంబరింగ్‌తో సులభంగా సమస్యల గుర్తింపు

హనుమకొండ టౌన్, ఆగస్టు 5: విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పనితీరు మారుతోంది. ఉన్నతాధికారుల చొరవతో కొత్త ఒరవడి కనిపిస్తోంది. ఒకప్పుడు అర్జీలు పెట్టుకుని, కాళ్ల చెప్పులరిగేలా అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారానికి నోచుకోని సమస్యలకు కూడా సమాధానం దొరుకుతోంది. వరిగిపోయి, తుప్పు పట్టి కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తెగిన, వదులుగా మారిన స్టేవైర్లు, పోల్‌కు పోల్‌కు మధ్య సాగి వేలాడుతున్న లైన్లను సరిచేయడంలో విద్యుత్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైతులతో పాటు గృహ వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయా సబ్‌స్టేషన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో సమస్య ఉన్న ప్రాంతాన్ని గుర్తించి మరమ్మతులు చేస్తున్నారు. అలాగే 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ స్తంభాలకు నెంబరింగ్ వేసే ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ఈ నెంబరింగ్‌తో సబ్ స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్, ఫీడర్ పరిధిలో ఉన్న విద్యుత్ లైన్స్‌లో సమస్య ఉత్పన్నమైనప్పుడు సమస్య ఉన్న ప్రాంతాన్ని విద్యుత్‌శాఖ దగ్గర ఉన్న మ్యాప్ ద్వారా గుర్తించేందుకు వీలు కలుగుతుంది. పసుపు రంగుపై ఎరుపు రంగుతో ఏరియా, పోల్ వరుసక్రమాన్ని స్పష్టంగా కనిపించేలా రాయిస్తున్నారు. దీని ద్వారా విద్యుత్ సిబ్బంది ఎలాంటి ఆటంకాలు లేకుండా సమస్య ఉన్న ప్రాంతానికి చేరుకుంటారు. గతంలో ఈ విధానం ఉన్నప్పటికీ స్పష్టంగా లేకపోవడంతో కొంత మార్పులు చేసి కొత్తగా విద్యుత్ స్తంభాలకు నెంబరింగ్ వేస్తున్నారు. అలాగే వర్షాలు పెరగనున్న నేపథ్యంలో తుప్పుపట్టిన స్తంభాల స్థానంలో కొత్తవి, వంగిన స్తంభాలను నిటారుగా నిలబెట్టే పనులను ఇప్పటికే పూర్తి చేశారు.





మహబూబాబాద్ సర్కిల్‌లో వంగిన తర్వాత, నిటారుగా నిలబెట్టిన తర్వాత విద్యుత్‌స్తంభాల దృశ్యం

సరిచేసినవి, కొత్తవి స్తంభాలు

హనుమకొండ సర్కిల్‌లో..

నిటారుగా చేసినవి	941
కొత్తవి స్తంభాలు	109
స్టే వైర్లు	158
సరిచేసిన లూజ్‌లైన్‌లు	37 కి.మీ

వరంగల్ సర్కిల్‌లో..

నిటారుగా చేసినవి	634
కొత్తవి (తుప్పు స్థానం)లో	35
స్టే వైర్లు	245
సరిచేసిన లూజ్ లైన్లు	34 కి.మీ

భూపాలపల్లి, ములుగులో..

నిటారుగా చేసినవి	507
సరిచేసిన లూజ్ లైన్	5.28 కి.మీ

జనగామలో..

నిటారుగా చేసిన స్తంభాలు	175

లూజ్‌లైన్లకు మోక్షం

గ్రామాల్లోని చెలకలు, పొలాల వద్ద లూజ్‌లైన్‌ల వద్ద పశువులు, మనుషులు విద్యుత్ వైర్లకు తాకి ఉమ్మడి జిల్లాలో మృత్యువాతపడ్డ ఘటనలు కోకొల్లలు ఉన్నాయి. దీనిని అరికట్టేందుకు విద్యుత్‌శాఖ అనేక ఏళ్లుగా ప్రయత్నిస్తున్నప్పటికీ సమస్యకు పరిష్కార మార్గం చూపలేదు. ఎన్పీడీసీఎల్ సీఎండీగా కర్నాటి వరుణ్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన ఈ 7 నెలల వ్యవధిలో ఎన్పీడీసీఎల్ పరిధిలో లూజ్ లైన్‌లు ఉన్న ప్రతీ చోట మిడిల్ పోల్ ఏర్పాటు చేయడం, సరిపోను స్తంభాలుంటే విద్యుత్ వైర్లను గట్టిగా లాగి సరిచేయడం లాంటివి చేశారు. విద్యుత్ స్తంభాలు వంగకుండా సపోర్ట్‌గా స్టేవైర్లు ఏర్పాటు చేశారు.

నియోజకవర్గంలో అవినీతి అంతమే నా లక్ష్యం

అధికారులకు ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదు : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 5: నియోజకవర్గంలో అవినీతిని అంతమొందించడమే తన లక్ష్యమని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ మంజూరు ప్రక్రియలో ఎవరూ అధికారులకు ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, ఏ అధికారైన దరఖాస్తును ముందుకు తీసుకెళ్లడానికి డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన 35మంది లబ్ధిదారులకు రూ 35,04,060 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, 140మందికి రూ. 40,50,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇకపై కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను నెల రోజులలోపే లబ్ధిదారులకు అందించేలా కృషి చేస్తానని తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి నిమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సల కోసం ఎల్‌ఓసీలు ఇప్పించేలా సహకరిస్తానన్నారు. తాను ఎమ్మెల్యే అయితే పనులు జరుగుతాయని, సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుతాయని, అవినీతి ఉండదనే నమ్మకంతో ప్రజలు తనను గెలిపించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి నిధులు, వైద్య సిబ్బంది, ఆర్టీసీ డిపోకు కేటాయించిన స్థలాన్ని ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి వెంటనే అమలు చేసేలా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ నెలలోనే ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసే అవకాశం ఉందన్నారు.



కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పొందిన లబ్ధిదారులతో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

డివిజన్ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.24కోట్ల నిధులతో అంచనాలు రూపొందించి సీఎంకు అందజేశామని, దాంతో సీఎం స్పందించి ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచే కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రాంభిద్దామని పేర్కొన్నట్లు గుర్తు చేశారు. డివిజన్ కేంద్రంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణానికి, రెండెకరాల విస్తీర్ణంలో పబ్లిక్ గార్డెన్ అందులో వాకింగ్ ట్రాక్, జిమ్‌ను ఏర్పాటు చేసేలా ప్రభుత్వ స్థలాలను అధికారులు వెంటనే గుర్తించాలని సూచించారు. రోడ్ల విస్తరణ పనులను చేపట్టబోతున్నామని, తాటికొండ క్రాస్ రోడ్డు నుంచి మల్లన్నగండి రిజర్వాయర్ వరకు, పల్లగుట్ట క్రాస్ రోడ్డు వద్ద నుంచి గార్లగడ్డతండా వరకు, విశ్వనాథపురం నుంచి జఫర్‌గఢ్ మండలంలోని ఓబులాపూర్ క్రాస్ రోడ్డు వరకు, ఉన్న సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ రవీందర్, ఎంపీడీవో మధుసూదన్, బ్లాక్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి నాగరబోయిన శ్రీరాములు, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి, నాయకులు బెలిదె వెంకన్న, సీహెచ్ నరేందర్ రెడ్డి, రాపోలు మధుసూదన్ రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్ రెడ్డి, చాడ రాజ్‌కుమార్, చల్లా రాజిరెడ్డి, నాగరబోయిన యాదగిరి, కోతి రాములు, రజాక్‌యాదవ్, గన్ను నర్సింహులు, తెల్లాకుల రామకృష్ణ, తోట వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఏడ్జర్లపల్లిలో కంటైనర్ ఆస్పత్రిని
ప్రారంభించిన సీతక్క



ఏడ్జర్లపల్లిలో కంటైనర్ ఆస్పత్రి ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

వాజేడు, ఆగస్టు 5: వాజేడు మండలంలోని ఏడ్జర్లపల్లి కొత్తురులో నూతనంగా మంజూరైన కంటైనర్ ఆస్పత్రిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం ప్రారంభించారు. సోమవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర, డీఎంహెచ్‌వో అప్పయ్యతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. కంటైనర్ ఆస్పత్రిలో బీపీని చెక్ చేయించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వాజేడు మండలంను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తాను కట్టుబడి ఉన్నానని, ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. జిల్లాలో రెండో కంటైనర్ ఆస్పత్రిని వాజేడు మండలంలో ప్రారంభించడం ఆనందంగా ఉందని, ఈకంటైనర్ ఆస్పత్రిలో ప్రతి వారంలో రెండు రోజులపాటు వైద్యుడు అందుబాటులో ఉండాలన్నారు. నిత్యం ఏఎన్ఎం విధులు నిర్వహించి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. జిల్లాలో పలు స్వచ్ఛందసంస్థల సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్చలు జరుపుతున్నామని, స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని, ఇందులో ప్రతీ ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. యువతకు ఉద్యోగాల కల్పన కోసం ఐటీఐల ద్వారా స్కిల్ ప్రోగ్రాంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులను చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నారని, ఆ విధంగా పథకాలను రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘంలో ఉన్న మహిళలకు ప్రమాద బీమా కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. త్వరలోనే భద్రాచలం నియోజకవర్గంలో ఇళ్లను మంజూరు చేస్తానన్నారు. వాజేడు, వెంకటాపురం మండలాలలో వరదల వల్ల ఇబ్బందులు పడుతున్నారని ఆ సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

గుంతల రోడ్డులో సీతక్క కాన్వాయ్ ప్రయాణం

ఏడ్జర్లపల్లికి వచ్చేందుకు మంత్రి సీతక్క ఇబ్బందులు పడ్డారు. పూసూరు నుంచి ఏడ్జర్లపల్లికి సుమారు ఏడు కిలోమీటర్ల రహదారి అధ్వానంగా ఉండటంతో ఆమె కాన్వాయ్ వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో రోడ్డు స్థితిపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన సీతక్క తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. తన శాఖ ద్వారా మరిన్ని నిధులు ఇచ్చి రోడ్లను బాగు చేస్తానని హామీ ఇచ్చారు. ఏడ్జర్లపల్లి చుట్టు పక్కల గ్రామాల ఇబ్బందుల స్వయంగా చూశానని, ఆ ఇబ్బందులను తొలగించేందుకు అధికారులతో మాట్లాడతానన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావుతో కలిసి రెండు మండలాల అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట జడ్పీటీసీలు తల్లడి పుష్పలత, పాయం రమణ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్ వర్మ, ప్రసాదబాబు రాజు, కల్యాణ్, తదితరులు ఉన్నారు.

తెలుగులో స్వామికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 5: కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పరిశోధకుడు బానోతు స్వామి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు సోమవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి స్వామికి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'తెలంగాణ గిరిజన కథా సంపుటాలు' అనే అంశంపై కేయూ ఆర్ట్స్ డీన్, తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి పర్యవేక్షణలో బానోతు స్వామి పరిశోధన పూర్తి చేశారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దేవుని తండాకు చెందిన స్వామి గిరిజన సాహిత్యంలో కథా సాహిత్యంపై ప్రామాణికమైన పరిశోధన గ్రంథాన్ని ప్రచురించారు. జాతీయ గిరిజన ఫెల్లోషిప్ సాధించా రు. కర్ణాటక మైసూర్‌లోని భారతీయ భాషా సంస్థకు ఎంపికయ్యారు. 11 అంతర్జాతీయ, మరో 20 జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. గిరిజన సాహిత్యంపై మళప్ అనే పుస్తకాన్ని ముద్రించారు. డాక్టరేట్ సాధించిన స్వామిని పలువురు అభినందించారు.

బీఈడీ కళాశాలలో దివ్యాంగులకు రేపు ప్రత్యేక శిబిరం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: సమగ్ర శిక్ష, అల్మికో ఆధ్వర్యంలో దివ్యాంగులకు బుధవారం హనుమకొండలోని బీఈడీ కళాశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఎం.డి.అబ్దుల్ హై సోమవారం ఒకప్రటనలో తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు దివ్యాంగ విద్యార్థులను పరీక్షించి వారికి అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు వారి ఆధార్ కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికేట్, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న సదరం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని రావాలని తెలిపారు. ఉదయం 9 గంటలకల్లా కళాశాలలో ఉండాలని పేర్కొన్నారు.

ఐటీఐలో మూడో దఫా ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్ల కోసం నిర్వహిస్తున్న మూడో దఫా ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.చందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొనే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళా విద్యార్థులు సైతం దరఖాస్తులు చేసుకోవచ్చునని, వారికి ప్రవేశాల్లో 33 శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు.

ముగిసిన డీఎస్సీ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ కోసం నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు సోమవారంతో ముగశాయి. గత నెల 18 నుంచి సోమవారం వరకు 13 రోజులుగా జిల్లా కేంద్రంలోని 5 ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు సజావుగా ముగిశాయి. మొత్తం 23,467 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 21,305 మంది పరీక్షకు హాజరు కాగా 2,162 మంది గైర్హాజరయ్యారు. కాగా జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో మొత్తం 90.79 శాతం మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు.

9న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఈనెల 9న హెచ్‌సీఎల్ సహకారంతో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు డీఐఈవోలు కె.మాధవరావు, ఎ.గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ (కో-ఎడ్) కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో 75 శాతంతో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, వొకేషనల్ కంప్యూటర్ సైన్స్ ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించి విద్యార్థులు ఈజాబ్ మేళాలలో పాల్గొనవచ్చునని వారు తెలిపారు. జాబ్ మేళాలలో ఉద్యోగం సాధించిన వారికి వేతనంతో పాటు ప్రముఖ వర్సిటీల్లో డిగ్రీ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు నరేష్ (7569177071)ను సంప్రదించాలని వారు సూచించారు.

20న ఎన్పీడీసీఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్ కమిటీ ఎన్నికలు

హనుమకొండ టౌన్, ఆగస్టు 5: టీజీ ఎన్పీడీసీఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యుల ఎంపిక కోసం ఈ నెల 20న ఎన్నిక నిర్వహించనున్నట్లు ఉమ్మడి వరంగల్ సర్కిల్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఛైర్మన్, హనుమకొండ సూపరింటెండెంట్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల12 నుంచి 14 వరకు కొత్తగా ఏర్పాటు కాబోయే కౌన్సిల్ నందు సభ్యత్వం కోసం హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ క్రీడాకారుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 17న దాఖలు చేసిన నామినేషన్లు ఉపసంహరణకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. 20న ఎన్నిక నిర్వహించి సాయంత్రం 5 గంటలకు ఫలితాలు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.



కొమ్మూరితో కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు

కొమ్మూరిని కలిసిన లీగల్ సెల్ నాయకులు

జనగామ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నాయకులు జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల సమయంలో పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేర్చడంపై లీగల్ సెల్ తరఫున ప్రభుత్వానికి న్యాయవాదులు ధన్యవాదాలు తెలిపారు. పార్టీని మరింతగా పటిష్టం చేసేందుకు లీగల్ సెల్ పనిచేయాలని కొమ్మూరి సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లో వెళ్లేలా చూడాలన్నారు. కొమ్మూరిని కలిసిన వారిలో లీగల్ సెల్ ఛైర్మన్ నాగరాజశర్మ, వైస్ ఛైర్మన్ కూరెల్ల శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదులు రవీందర్‌రెడ్డి, సిద్ధిరాములు, బొట్ల వినోద్, చాట్ల నర్సింగరావు, బండ శ్రీనివాస్, ఎండబట్ల పర్శరాములు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

గండిరామవరం చేరుకున్న గోదావరి జలాలు



గండిరామవరం రిజర్వాయర్‌లోకి చేరుతున్న గోదావరి జలాలు

నర్మెట, ఆగస్టు 5 : మండలంలోని గండిరామవరం రిజర్వాయర్‌కు సోమవారం గోదావరి జలాలు చేరుకున్నాయి. ధర్మసాగర్ రిజర్వాయర్‌కు గోదావరి జలాలు వస్తుండడంతో ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి గండిరామవరం(మల్లన్నగండి) రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేశారు. 0.4 టీఎంసీ సామర్థ్యం గల రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేయడంతో గండిరామవరం ప్రజలతో పాటు మండల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గండిరామవరం రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు వస్తుండడంతో మండలంలోని బొమ్మకూర్, వెల్దండ, కన్నెబోయినగూడెం రిజర్వాయర్‌లలోకి కూడా గోదావరి జలాలు వస్తాయని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ బోరుబావుల్లోకి నీళ్లు మల్లుతాయని రైతులు ఆశభావంతో ఉన్నారు. వర్షాలతో ఇప్పటివరకు మండలంలో ఒక్క చెరువు, కుంట కూడా నిండలేదు. దీంతో గోదావరి జలాలపైన రైతులు ఆశలు పెట్టుకున్నారు.

ప్రభుత్వ భూమి పేద ప్రజలకు చెందాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

బచ్చన్నపేట, ఆగస్టు 5: ప్రభుత్వం స్వాధీనపర్చుకున్న 174 సర్వే నంబర్ భూమిపై మళ్లీ కబ్జాదారుల కన్ను పడిందని, రెవెన్యూ అధికారుల అలసత్వం వల్లే ఇలాంటి కార్యక్రమాలకు కొందరు పాల్పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవులు అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూమిని కాజేశారని, సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన పోరాటం మూలంగా ప్రభుత్వం 174లో ఆక్రమణకు గురైన భూమిని తిరిగి స్వాధీనం చేసుకుందన్నారు. ఈ భూమిలో మండలంలోని ఇల్లులేని నిరుపేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, వారికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారికే వచ్చిందంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లోను ఆభూమి పేదలకు చెందాల్సిందేనన్నారు. ఇందుకోసం సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్, భూసాధన కమిటీ నాయకులు పర్వతం నర్సింహులు, వ్యకాస మండల కార్యదర్శి ఇంజే ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు జాతీయ చేనేత దినోత్సవం

జనగామ కల్చరల్, ఆగస్టు 5: జాతీయ చేనేత దినోత్సవాన్ని ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు చేనేత మరియు జౌళి శాఖ జిల్లా అధికారి చౌడేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు జనగామ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు చేనేత కార్మికుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తారు. 10.45 గం.లకు సభ ప్రారంభమవుతుందని, 11 గం.లకు చేనేత దినోత్సవ ప్రతిజ్ఞ, అనంతరం ముఖ్య అతిథుల ప్రసంగాలు, నైపుణ్యం కలిగిన చేనేత కార్మికులకు సన్మానం ఉంటుందన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు

- రహదారుల అభివృద్ధికి చర్యలు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గడ్, ఆగస్టు 5: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ పథకాల మంజూరులో లబ్ధిదారులు దళారులను ఆశ్రయించవద్దని, ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దని ప్రజలను కోరారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కళ్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ వంటి పథకాలు పేదలకు వరంగా మారాయన్నారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు..

మండలంలో దెబ్బతిన్న రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఐనవోలు మండలం వెంకటాపూర్ క్రాస్ నుంచి జఫర్‌గడ్ మండలం రఘునాథ్‌పల్లి, కోనాయిచలం మీదుగా జఫర్‌గడ్ వరకు, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం విశ్వనాథపురం నుంచి జఫర్‌గడ్ మండలం తీగారం, సూరారం, షాపల్లి క్రాస్, తమ్మడపల్లి(జి), ఓబులాపూర్ మీదుగా జఫర్‌గడ్ శివారు నల్లబండ క్రాస్ వరకు బీటీ డబుల్ రోడ్ల నిర్మాణం, అలాగే జఫర్‌గడ్ శివారు నుంచి జడ్పీ హైస్కూల్, పాత బస్టాండ్ నుంచి నల్లబండ క్రాస్ వరకు నాలుగు లైన్ల (ఫోర్ లైన్స్) బీటీ రహదారితో పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుకు ఈ నెలలోనే ఈ మూడు రోడ్ల నిర్మాణ పనులు మంజూరవుతాయని తెలిపారు. చిలుపూర్ మండలం నష్కల్ నుంచి జఫర్‌గడ్ మీదుగా పాలకుర్తి వరకు చేపట్టిన వరద కాలువల నిర్మాణ పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా జఫర్‌గడ్ మండలాన్ని హన్మకొండ జిల్లాలో చేర్చేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.

ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే కడియం జఫర్‌గడ్‌లో ప్రారంభించారు. స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, అధికారులు నిర్వహించిన ర్యాలీలో కడియం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అపరిశుభ్రత లేకుండా చూడాలని, విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు.

రోడ్డు దుస్థితిపై ఎమ్మెల్యే అసంతృప్తి...

ప్రధాన బీటీ రోడ్డు నుంచి జఫర్‌గడ్ సెంటర్‌కు వెళ్లే సీసీ రోడ్డు అధ్వాన్నంగా బురదమయంగా ఉండడం పట్ల ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో స్వచ్ఛదనం - పచ్చదనంపై ర్యాలీగా విద్యార్థులతో కలిసి నడిచి వస్తున్న సందర్భంలో.. నీరు నిలిచి నడవలేని విధంగా బురదతో కూడిన ప్రధాన రహదారిని చూసి ఇదేం రోడ్డు అంటూ.. వెంట ఉన్న ఆర్డీఓ, ఇతర అధికారులను ప్రశ్నించారు. సీసీ రోడ్డును పూర్తిగా వేయకుండా అసంపూర్తిగా ఎందుకు వదిలేశారన్నారు. విచారణ జరిపి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండు మూడు రోజుల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ వెంకన్నను ఆదేశించారు.



జఫర్‌గడ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఈ సమావేశంలో స్టేషన్‌ఘన్‌పూర్ మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎల్.మనోహర్, తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీవో సుమన్, సొసైటీ ఛైర్మన్ కరుణాకర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ బాసెట్టి హరిప్రసాద్, మాజీ ఎంపీపీ రడపాక సుదర్శన్, మాజీ జడ్పీటీసీ ఇల్లందుల బేబీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల అయిలయ్య, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు, హెచ్ఎం శరోన్, కార్యదర్శి రాజేశ్వర్‌రావు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, విద్యార్థులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రుణమాఫీ కావడం లేదంటూ బ్యాంకు ఎదుట ఆందోళన



నెల్లుట్ల కెనరా బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

లింగాలఘణపురం, ఆగస్టు 5: అర్హతలున్నప్పటికీ పంట రుణాలు తీసుకున్న రైతుల పేర్లు రుణమాఫీ జాబితాలో లేకపోవడం పట్ల సోమవారం లింగాలఘణపురం మండలం నెల్లుట్ల కెనరా బ్యాంకు ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం నెల్లుట్ల దత్తత బ్యాంకులో అదేగ్రామానికి చెందిన రైతులు వ్యవసాయరుణాలు తీసుకున్నామని ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమకు అర్హతలున్నప్పటికీ రుణమాఫీ జాబితాలో తమ పేర్లు లేకపోవడం పట్ల తాము నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న లీడ్‌బ్యాంకు మేనేజర్ శ్రీధర్ నెల్లుట్ల కెనరాబ్యాంకును సందర్శించి రుణమాఫీ జాబితాను పరిశీలించారు. ఇందులో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పూర్తి స్థాయిలో అర్హుల జాబితాను ప్రభుత్వానికి రిపోర్టు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి 'పాల్కురికి' పేరు పెట్టాలి

పాలకుర్తి, ఆగస్టు 5: తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాథుడి పేరు పెట్టాలని సోమనాథ కళాపీఠం సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం మార్పు అంశాన్ని ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించారని అన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం జరిగిన మలిదశ ఉద్యమం నాటి నుంచి తెలంగాణ వాదులు ఈ విశ్వవిద్యాలయానికి పాల్కూరికి సోమనాథుడి పేరు పెట్టాలని బలంగా కోరుతున్నారని అన్నారు.

ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడానికి కట్టుబడి ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి సానుకూల నిర్ణయం తీసుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. సురవరం ప్రతాపరెడ్డి పేరును పాలమూరు విశ్వవిద్యాలయానికి పెట్టవచ్చునని సూచించారు. సాహిత్యాభిమానులు సబ్బండ వర్గాలు, రాజకీయ పక్షాలు ప్రభుత్వానికి నచ్చచెప్పి తెలుగు విశ్వవిద్యాలయానికి పాల్కూరికి పేరు పెట్టేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో గౌరవ సలహాదారు వీరమనేని వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షుడు మార్గం లక్ష్మీనారాయణ, ఇమ్మడి దామోదర్, జక్కుల రవీందర్, మామిండ్ల రమేష్‌రాజా, రాపాక విజయ్, సాంబయ్య, రాపోలు వెంకటేశ్వర్లు, బజ్జూరి వేణుగోపాల్ ఉన్నారు.

కేసు విషయంలో వెళ్తే సీఐ దాడి చేశాడు

న్యాయవాద దంపతుల ఆరోపణ

జనగామ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలి కేసు విషయంలో మాట్లాడేందుకు వెళ్లగా తమపై జనగామ సీఐ రఘుపతిరెడ్డి దాడి చేశారని న్యాయవాద దంపతులు ఆరోపించారు. జనగామకు చెందిన న్యాయవాదులు గద్దల అమృతరావు, కవిత దంపతులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామకు చెందిన ఓ వృద్ధురాలిని సొంత కొడుకులు, కోడండ్లు తీవ్రంగా కొట్టారని, దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జనగామ పోలీసులు పట్టించుకోలేదని తెలిపారు. ఈ విషయాన్ని వృద్ధురాలు తమ దృష్టికి తీసుకురావడంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లామన్నారు. తాము వెళ్లి పరిచయం చేసుకోవడంతోనే సీఐ తమపై నోటికి వచ్చినట్లు మాట్లాడరని అన్నారు. 'లాయర్లు అయితే కోర్టులో చూసుకోండి' అంటూ మాట్లాడారన్నారు. తమను కొట్టండి అంటూ పోలీసు సిబ్బందికి సైగ చేశారని, దీంతో ఎస్సై తిరుపతి, ఇతర కానిస్టేబుళ్లు తనను స్టేషన్‌లో అరగంట పాటు కూర్చోబెట్టి కొట్టారని న్యాయవాది అమృతరావు ఆరోపించారు. అనంతరం స్టేషన్ నుంచి బయటకు వచ్చాక డీసీసీ రాజమహేంద్రనాయక్‌ను కలిసి సీఐపై ఫిర్యాదు చేశారు. కాగా.. న్యాయవాద దంపతులపై పోలీసులు దాడి చేశారని ఆరోపిస్తూ జనగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విధుల బహిష్కరణకు పిలుపునిచ్చింది.

ఎలాంటి దాడి చేయలేదు: సీఐ రఘుపతిరెడ్డి

తనపై న్యాయవాద దంపతులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చి వారే ఇష్టారీతిన మాట్లాడారని, కనీసం గౌరవం ఇవ్వకుండా ప్రవర్తించారన్నారు. తాను ఏదైనా తప్పు చేస్తే కోర్టు ద్వారా చూసుకోవాలని మాత్రమే సూచించానని అన్నారు.

సీసీఎస్ బృందం విచారణ

పాలకుర్తి, ఆగస్టు 5: మూడు నెలలుగా మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న వరుస చోరీలపై సోమవారం సీఐ గట్ల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీసీఎస్ టీం ముమ్మర విచారణ చేపట్టింది. మండలంలోని గ్రామాల్లో చోరీలు జరిగిన ఇళ్లకు పోలీసులు, సీసీఎస్ టీం సభ్యులు వెళ్లి ఆధారాలతో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఒంటరి మహిళలు, వృద్ధులను టార్గెట్‌గా చేసుకొని చోరీలు జరుగుతున్నాయని త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

చోరీకి యత్నం

జనగామ కల్చరల్, ఆగస్టు 5: జనగామలో దొంగలు పలు ఇళ్లలో చోరీకి యత్నించారు. సోమవారం సీఐ రఘుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జనగామ జిల్లా కేంద్రం లోని ప్రెస్టన్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని ఆదివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. కాలనీలోని అశోక్ నాయక్, పాలడి దేవా కుటుంబాలు తమ ఇళ్లకు తాళం వేసి సొంతూళ్లకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు ఆదివారం రాత్రి తాళాలు పగులగొట్టి ఇండ్లలోకి ప్రవేశించి వస్తువులన్నింటినీ చిందరవందరగా పడేశారు. కాగా ఈ చోరీలో ఎటువంటి వస్తువులు, నగదు అపహరణకు గురి కాలేదని పోలీసులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం కేసులో ఒకరికి రిమాండ్

చిలుపూర్, ఆగస్టు 5: నిబంధనలకు విరుద్ధంగా పీడీఎస్ బియ్యం వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాజవరంనకు చెందిన మోటం దేవేందర్ గ్రామాల్లో చిరు వ్యాపారులను ఏర్పాటు చేసుకుని పీడీఎస్ బియ్యాన్ని సేకరించడంతో పాటు, ఇతర రాష్ట్రాలకు లారీల ద్వారా తరలిస్తున్నాడు. గత రెండు రోజుల క్రితం మండలంలోని రాజవరం పరిధిలో గల ఓ నిర్మానుష్య ప్రదేశంలో ఇతడు నిల్వ చేసిన 160 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వరంగల్ టాస్క్‌ఫోర్స్, చిలుపూర్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి పట్టుకున్నారు. కాగా, గతంలో ఇతనిపై రామగుండం కమిషనరేట్ పరిధిలోని బసంత్‌నగర్, సుల్తానాబాద్, ధర్మారంతో పాటు, వరంగల్ కమిషనరేట్ పరిధిలోని మడికొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు కేసులు నమోదయ్యాయి.

ఈ మేరకు పై నిందితుడు దేవేందర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ సీఐగా నరేష్ బాధ్యతలు

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 5: స్టేషన్‌ఘన్‌పూర్ నూతన సీఐగా జి. నరేష్ సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన ముస్కు రాజును సీపీ అంబర్ కిశోర్‌ఝా వీఆర్‌కు బదిలీ చేసి ములుగు జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న నరేష్‌ను ఘన్‌పూర్‌కు సీఐగా బదిలీ చేశారు. విధుల్లో చేరిన అనంతరం సీఐ నరేష్ స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నూతనంగా విధుల్లో చేరిన సీఐకి సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రఘునాథపల్లి సీఐగా శ్రీనివాసరెడ్డి

రఘునాథపల్లి, ఆగస్టు 5: రఘునాథపల్లి సీఐగా ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి సోమవారం రెండవసారి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన ఇక్కడ సీఐగా పనిచేసి ఎన్నికల కోడ్‌లో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో వరంగల్ ఐటీ కోర్‌కు బదిలీపై వెళ్లారు. ఈయన ఇక్కడ సీఐగా పని చేసిన శ్రీనివాస్ యాదవ్ కొద్ది రోజుల వ్యవధిలోనే వరంగల్ ఐటీ కోర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కొన్ని నెలల వ్యవధిలోనే సీఐగా శ్రీనివాసరెడ్డి రెండో సారి బాధ్యతలు స్వీకరించారు.

చిలుపూర్ ఎస్సైగా నవీన్‌కుమార్

చిలుపూర్: చిలుపూర్ ఎస్సైగా సిరిపురం నవీన్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ ఎస్సైగా పని చేసిన ముత్యం రాజేందర్ కమిషనరేట్ పరిధిలోని కేయూ పీఎస్‌కు బదిలీపై వెళ్లగా, వీఆర్‌లో ఉన్న నవీన్‌కుమార్ ఇక్కడకు వచ్చారు.

సోమేశ్వరాలయానికి వెండి పాత్రల బహూకరణ

పాలకుర్తి, ఆగస్టు 5 : మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన రాయపాటి వెంకట్‌రెడ్డి, వనజ దంపతులు శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింస్వామికి ఒక కేజీ 97 గ్రాముల వెండి చిన్న గంగాళం, వెండి చెంబును ఆలయ అధికారులకు సోమవారం అందచేశారు. ఈ సందర్భంగా సోమేశ్వరాలయంలో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. వెంకట్‌రెడ్డి, వనజ దంపతులు మాట్లాడుతూ శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి మా కుటుంబానికి ఇలవేల్పు దైవమని అన్నారు. కోరికలు తీర్చే సోమేశ్వరుడుకి వెండి గంగాళం, చెంబును అందచేసి మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. ఈ రెండు పాత్రల విలువ రూ. 1 లక్షా 12 వేలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మీప్రసన్న, సూపరిండెంట్ వెంకటయ్య, ఆలయ సిబ్బంది, అర్చకులు ఉన్నారు.

సిద్దులగుట్టకు భక్తుల తాకిడి..

బచ్చన్నపేట, ఆగస్టు 5: శ్రావణమాస ప్రారంబం రోజునే సోమవారం రావటంతో ప్రముఖ శైవక్షేత్రమైన కొడవటూరు సిద్దులగుట్టకు భక్తజనం పోటెత్తారు. అర్చనలు, అభిషేకాలు, అన్నపూజలు చేయించేందుకు గంటల తరబడి క్యూలైన్‌లో వేచిఉన్నారు. శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు జరిపిస్తే అంతా శుభం జరుగుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వాసంతో భక్తుల రద్దీ పెరిగింది. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో చిందం వంశీ తెలిపారు. కాగా శ్రావణ మాసం పురష్కరించుకుని గతంలో నిలిచిపోయిన నిత్యాన్నదాన కార్యక్రమం దాతలు ముందుకు రావటంతో తిరిగి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు ఓంనమఃశివాయ, అధికారులు చల్లా రాజేందర్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, మధు, మహాశివుడు, సదాశివుడు, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రఘునాథపల్లి, ఆగస్టు 5: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ జిల్లా పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మల్లిఖార్జున్‌రావు అన్నారు. మండలంలోని కోమల్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి నస్రీన్, సీహెచ్‌వో సీనారాణి, సూపర్‌వైజర్ బిక్కు నాయక్, ఫార్మాసిస్టు కల్పన, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థికి బంగారు పతకం

రఘునాథపల్లి, ఆగస్టు 5: కరీంనగర్ జిల్లాలో జరిగిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ -2024 పోటీలలో మండలంలోని వెల్ది మోడల్ స్కూల్‌కు చెందిన పి.సిద్దార్థ గౌతమ్ 13 సంవత్సరాల బాలుర ఇండివిజల్ కటాస్ విభాగంలో బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పతకం సాధించిన విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్సీ వర్గీకరణపై తీర్పును పునఃసమీక్షించాలి

జనగామ కల్చరల్, ఆగస్టు 5: ఎస్సీ వర్గీకరణపై తీర్పును పునఃసమీక్షించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు తాటి కుమార్ అన్నారు. ఈ మేరకు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు న్యాయబద్ధంగా లేదన్నారు. ఆరుగురు జడ్జిల ధర్మాసనంలో ఒక జడ్జి మిగిలిన వారితో ఏకీభవించలేదని, దీంతో తీర్పు రాజ్యాంగబద్ధంగా లేదని భావిస్తున్నామన్నారు. మా అభ్యర్థనలను మీ ద్వారా భారత గౌరవ రాష్ట్రపతికి నివేదించాలని కోరారు.

తేజశ్రీ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

జనగామ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గత నెల 29న అయోధ్యలోని సరయూ నదిలో గల్లంతైన జనగామకు చెందిన తాళ్లపల్లి తేజశ్రీ కుటుంబాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. సరయూ నదిలో గల్లంతైన తేజశ్రీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు ఈనెల 4న జనగామకు తిరిగి వచ్చారు. కాగా.. అయోధ్య నుంచి జనగామకు వచ్చిన తేజశ్రీ తల్లితండ్రులను పల్లా పరామర్శించారు. కూతురి ఆచూకీ లభ్యం కాక దుఃఖంలో ఉన్న తేజశ్రీ తల్లితండ్రులు నాగరాజు, జయసుధను ఎమ్మెల్యే ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట మునిసిపల్ ఛైర్‌పర్సన్ పోకల జమున, పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 5: మండలంలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె పృథ్వీ నానమ్మ గాదె కమలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య సోమవారం కమలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ మారపాక రవి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్, మాజీ మార్కెట్ వైస్ ఛైర్మన్ చల్లా చందర్ రెడ్డి, ఆకుల కుమార్, మారపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

జనగామ కల్చరల్, ఆగస్టు 5: కరాదుల వెంకట్‌రెడ్డి ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న 'బతుకు సంతకం' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు కవయిత్రి అరుణ కీర్తి పతాక తెలిపారు. ఈ మేరకు సోమవారం జనగామ జిల్లా కేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. నర్మెట మండలం మచ్చుపహాడ్‌లో జరిగే ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి వరంగల్ పూర్వ మేయర్ టి.రాజేశ్వర్‌రావు, ఆయుర్వేద వైద్య నిపుణులు ఎ.సమ్మిరెడ్డి తదితరులు హాజరవుతారన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జనగామ, (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 5: జనగామ జిల్లాకేంద్రంలోని అన్ని వార్డుల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. జిల్లాకేంద్రంలోని 20వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్ జూకంటి లక్ష్మీశ్రీశైలం పాల్గొన్నారు. వార్డు ప్రజలతో ర్యాలీ నిర్వహించి పారిశుధ్యం, పచ్చదనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ వెంకట్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత, ఆర్పీ భద్ర, బిల్ కలెక్టర్ కృష్ణవాసు, వార్డు ప్రజలు పాల్గొన్నారు. అదే విధంగా జిల్లాకేంద్రంలోని 30వ వార్డులో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకుర్తి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన రోహిత్‌సింగ్ మాట్లాడుతూ గ్రామాలు పచ్చదనంతో స్వచ్ఛదనంతో విరాజిల్లాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మొగులప్ప, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, ప్రత్యేక అధికారి జయంతి, హెచ్ఎం శోభరాణి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరాచారి తదితరులు ఉన్నారు.

చిలుపూర్: ప్రతీఒక్కరూ తమ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి మాధవీలత సూచించారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా తొలిరోజు మండలంలోని మల్కాపూర్, కొండాపూర్, చిలుపూర్, వెంకటాద్రిపేట, చిలుపూర్, పల్లగుట్ట, కృష్ణాజీగూడెం, గార్లగడ్డ, ఫతేపూర్ తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వీధి కుక్కలను గుర్తించి పశు సంవర్ధక శాఖ అధికారులకు సమాచారమందించాలని, క్రమం తప్పకుండా వీధులతో పాటు, డ్రెయినేజీలను శుభ్రం చేయించాలని జీపీల సెక్రటరీలను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బర్మావత్ శంకర్, ఎంపీవో శ్రీపాద మధుసూధన్, ఈజీఎస్ ఏపీవో మోహన్‌రావు, ఐకేపీ ఏపీఎం ఈద రమేష్ కుమార్, జీపీ సెక్రటరీలు నవనీత, ఎమ్డీ ఆజీజ్‌పాషా, శశిదర్‌రెడ్డి, శ్రీరంగారెడ్డి, తండ రాంబాబు, బాహూనాయక్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

బచ్చన్నపేట: ఐదు రోజుల పాటు కొనసాగే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు సోమవారం మండలంలో ప్రారంభమయ్యాయి. మండల స్పెషల్ ఆఫీసర్ వినోద్‌కుమార్, ఎంపీడీవో మల్లిఖార్జున్‌లు పలు గ్రామాలు సందర్శించి జరుగుతున్న పనులు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులకు డంపింగ్ యార్డ్, నర్సరీ, తాగునీటి ట్యాంకులు, పల్లెప్రకృతివనాలు, మంచినీటి సరఫరాపై విలేజ్ టూర్ నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఇర్రి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిడుగు, జఫర్‌గడ్, తదితర గ్రామాల్లో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొని అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు శరోన్, సదానందం, ఉపాధ్యాయులు నవీన్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, నీరజారెడ్డి, మనోహరస్వామి, నరెందర్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు, యువత, పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలోని 20వ వార్డులో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ జూకంటి లక్ష్మీశ్రీశైలం

నర్మెట: మండలంలోని అన్ని గ్రామాలలో ర్యాలీలు నిర్వహించారు. మల్కపేట, హన్మంతాపూర్ గ్రామాలలో డీఎల్‌పీవో పార్థసారధి పాల్గొని ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనార్థాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఎంపీడీవో అరవింద్, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

లింగాలఘణపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ పౌరుడు సామాజిక బాధ్యతగా గుర్తించి భాగస్వామ్యం కావాలని మండల ప్రత్యేకాధికారి శ్రీధర్‌రావు అన్నారు. లింగాలఘణపురం మండల కేంద్రంతో పాటుగా గ్రామాల్లో విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, ఎంపీవో రఘురామకృష్ణ, హెడ్మాస్టర్ మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.